క్లుప్తంగా

చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీను నాయక్

పెదపూడి: అనపర్తి మండలంలో ఇటీవల చోరీలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల అనపర్తి పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. దీంతో ప్రజలు నగలు, మోటార్ సైకిల్, విలువైన వస్తువులు విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ప్రజలు ఊరు వెళ్లేటప్పుడు నగలు, ఇతర ఆభరణాలు నమ్మకమైన, భద్రత గల వారి ఇంట్లో పెట్టాలన్నారు. ఇళ్ల వద్ద, గ్రామంలో పెద్దలతో మాట్లాడి అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైన అనుమానితులు సంచరిస్తే వెంటనే 100 నంబర్‌కు, లేదా పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు సెమిస్టర్ పుస్తకాలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ పీహెచ్‌సీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ లక్ష్మికి ఘనంగా వీడ్కోలు


రంగంపేటలో అటెండర్ లక్ష్మిని సత్కరిస్తున్న డీటీ రంజిత్‌కుమార్ తదితరులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో అంటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న కాజులూరి లక్ష్మి సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ సత్కార సభలో డిప్యూటీ తహసీల్దార్ రంజిత్‌కుమార్, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొని లక్ష్మిని ఘనంగా సత్కరించారు. 32 ఏళ్లుగా వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లో ఆమె అందించిన సేవలను పలువురు కొనియాడారు.

సత్యనారాయణ సేవలు అభినందనీయం

బిక్కవోలు: 32 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసిన పితాని సత్యనారాయణ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు పితాని సత్యనారాయణ, పద్మజ దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.వీరప్రభాకరరావు, మాజీ ఎంపీటీసీ గొర్రెల త్రిమూర్తులు, పాలచర్ల చిట్టిబాబు చౌదరి, కొల్లు వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు


చంద్రేడులో కొలువైయున్న చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి దేవాలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వ్రత పూజలు చేశారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీఐటీయూ నాయకుల నిరసన

ప్రకాశం నగర్: వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు బి.పవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. పవన్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, టైం కంటింజెంట్, పార్ట్ టైమ్, గెస్ట్, పీస్ రేట్, గౌరవ వేతనం తదితర నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులలో సమానంగా వేతనం, సౌకర్యాలు అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో డీవైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు, ప్రజా సంఘాల నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

బొప్పాయి పండు.. లాభాలు మెండు


రంగంపేట మండలంలో సాగవుతున్న బొప్పాయి

రంగంపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి వద్ద లభించే బొప్పాయి ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉంది. అనేక వ్యాధులకు బొప్పాయి పండు, ఆకు రసం దివ్య ఔషధంగా పనిచేస్తోందని నిపుణులు చెబుతున్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రస్తుతం డెంగ్యూ జ్వరాలతో బాధితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. జ్వరంతో ఉన్న పాటుగా రక్త కణాలు తగ్గి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలెన్నో.. అయితే రక్త కణాలు వృద్ధి చేయడంలో బొప్పాయి పండు కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ప్రతిఒక్కరూ బొప్పాయి పండు తినాలని, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

బొప్పాయితో మందుల తయారీ

ఫార్మా కంపెనీలు బొప్పాయి, ఆకులతో మందులను తయారు చేసి ఆస్పత్రులకు విక్రయిస్తున్నారు. చౌకగా లభించే బొప్పాయి ఆకు కంపెనీల ద్వారా మందుల రూపంలో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఎదురవుతోంది. అలా కాకుండా ఇంట్లోనే బొప్పాయి పండు తినడం, వాటి ఆకులను కత్తిరించుకుని జ్యూస్ చేసుకోవడం లేదా నీటిలో ఉడకబెట్టి తాగడం రోజుకు రెండుసార్లు చేయాలి. రసం రుచిగా ఉండేందుకు తేనె, నిమ్మరసం కలుపుకుని తాగొచ్చు. ఆకురసంలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని ద్వారా జీర్ణక్రియతో పాటు రక్తంలోని ప్లేట్‌లెట్లను వృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది. క్యాన్సర్, అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం, జలుబు, దగ్గు, జ్వరం, కీళ్ల నొప్పులు, వాపులు వంటి రోగాలను బొప్పాయి నియంత్రిస్తుంది.

విటమిన్లు పుష్కలం

గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా దొరికే బొప్పాయి పండులో విటమిన్-ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి ఉపయోగపడుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉండటంతో పండు కొద్దిగా తిన్నా కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీని ద్వారా శరీర బరువు తగ్గడంతో పాటు శరీరంలో కొవ్వు తగ్గుతుంది. చక్కెర వ్యాధి ఉన్నవారికి బొప్పాయి ఆకురసం, పండు ఎంతగానో ఉపయోగపడతాయి. జీర్ణక్రియను పెంచడం, బరువును తగ్గించడంలో ఈ పండు ఉపయోగకారి.

బొప్పాయి తీసుకోవొచ్చు



డెంగ్యూ జ్వర బాధితులతో పాటు పలు వ్యాధులకు బొప్పాయి ఆకు రసం ఉపయోగపడుతుంది. వైద్యులు సూచించిన మేర బొప్పాయి పండు, ఆకురసం వినియోగించుకోవాలి. తక్కువ మోతాదులో రోజూ పండు తినడం, అధికంగా నీరు తాగడం మంచిది. ఆకురసం తీసుకునే ముందు వైద్యుల సలహాలు తీసుకోవాలి.

– డాక్టర్ కె.చిన్నారావు,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రంగంపేట

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం


పందలపాకలో రాట ముహూర్తం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో వెలంపేట రామాలయం వద్ద గల శ్రీదేవి నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం సోమవారం చేశారు. నవరాత్రుల్లో రోజూ కుంకుమార్చన, అమ్మవారి సేవ, పడిపూజ, సర్వసతి పూజలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బారపు పద్మావతి, మాజీ పంచాయతీ వార్డు సభ్యులు గొర్రిపోటి సత్యనారాయణ, గురువు భవాని పంపన గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వన సంరక్షణ సామాజిక బాధ్యతగా చేపట్టాలి


వన సంరక్షణలో భాగంగా మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట: వన సంరక్షణ సామాజిక బాధ్యతగా చేపట్టి ఇంటింటా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని వడిశలేరు భజేనారాయణస్వామి ఆలయం వద్ద స్వధర్మా పిరమిడ్ సొసైటీ అధ్యక్షుడు జేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన వన సంరక్షణ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతిని ఆరాధించడమే ఆధ్యాత్మికతని, భావితరాలకు కాలుష్య రహితమైన ఆక్సిజన్ అందించడానికి, జీవరాశుల మనుగడకు పచ్చని చెట్లు ఎంతో దోహదపడతాయని ఆయన చెప్పారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా పిరమిడ్ సొసైటీ సేవాదళ్ అధ్యక్షురాలు అనిత, రాంబాబు, ప్రసాద్, సుహాసిని, వెంకట్రావు, సత్యనారాయణ, వీర్రాజు, నవీన్ పాల్గొన్నారు.

రామాలయంపై టీడీపీ నాయకుల దుశ్చర్య


పురుషోత్తపట్నంలో రామాలయం తాళాలు పగులగొడుతున్న దృశ్యం

సీతానగరం: రామాలయంపై పెత్తనం మాదేనంటూ టీడీపీ నాయకులు ఆలయ తాళాలు పగులకొట్టారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో సోమవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానికంగా కొందరు మహిళలు, పురుషులు సేవా సంఘంగా ఏర్పడి ఏడాదిన్నర నుంచి రామాలయంలో దీపారాధన, పండగల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామంలో స్వచ్ఛందంగా సేవలు చేస్తున్నారు. అయితే ఆలయంపై సేవా సంఘం పెత్తనమేమిటంటూ గ్రామంలోని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ తాళాలు బద్దలు కొట్టి స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఆలయంలో ఉత్సవ విగ్రహాలు లేకపోతే ఏడాదిన్నర క్రితం రామాలయ సేవా సమితి బృందం దశవతార సహిత శ్రీరామ పరివార ఉత్సవ విగ్రహాలను సమకూర్చి ప్రతిష్ఠించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తుల సహాయ, సహకారాలతో ఘనంగా అన్నసమారాధన జరిపారు. పండగలు, ప్రత్యేక రోజుల్లో ఆలయంలో పారాయణలు నిర్వహిస్తున్నారు. అయితే గ్రామంలోని టీడీపీ నాయకుల ఆలయం పెత్తనంపై కన్నేశారు. అన్నసమారాధన జరిగిన రోజు రాత్రి నుంచి ఆలయ తాళాలను ఇవ్వాలని బృందం సభ్యులపై ఒత్తిడి చేశారు. రామాలయ సేవా బృందం సభ్యులు మాట్లాడుతూ గతం నుంచి రామాలయం బాగోగులు పట్టించుకునే నాథుడు లేడని, తాము బృందంగా ఏర్పడి ఏడాదిన్నర నుంచి ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ తాళాలు బద్దలు కొట్టడం దారుణమని, దానిపై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చదువుతోనే విలువ పెరుగుతుంది


పందలపాకలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి

బిక్కవోలు: చదువుతోనే వ్యక్తి విలువ పెరుగుతుందని గ్రామ ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి అన్నారు. సోమవారం పందలపాక గ్రామంలోని శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆయన ప్రభుత్వం అందించే పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకే కాకుండా గ్రామానికి సైతం గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుణ్ణం శ్రీనివాస చౌదరి, మాజీ ఎంపీటీసీ అనసూరి నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పంపన వీర సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెదపూడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరికి ఎండాకు తెగులు వ్యాపించే అవకాశం ఉందని దానిపై సస్యరక్షణలో చర్యలు చేపట్టాలని ఏఓ టీవీఆర్ మణిదీప్ అన్నారు. సోమవారం ఆయన దోమాడ గ్రామంలో రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ వరి పొలంలో ఎక్కువగా ఎండాకు తెగులు కనిపిస్తుందన్నారు. దీన్ని బాక్టీరియల్ లీఫ్‌బ్లెట్(బీఎల్‌బీ) అని పిలుస్తారన్నారు. ప్రస్తుతం వరి పొలం ఈనిక దశకు చేరుకుందన్నారు. ఎండాకు తెగులు ఆశించిన పొలంలో నివారణ చర్యలు చేపట్టకపోతే పిలకలు ఎండిపోయి వెన్నులు సరిగా రాకపోవడం లేదా తాలు గింజలు ఏర్పడి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

నందరాడ సొసైటీ మహాజన సభ వాయిదా


సభ్యులు లేక వాయిదాపడిన నందరాడ సొసైటీ మహాజన సభ

రాజానగరం: మండలంలోని నందరాడ కో ఆపరేటివ్ సొసైటీలో ప్రత్యేకాధికారి టి.కృష్ణవేణి అధ్యక్షతన సోమవారం నిర్వహించదలచిన సర్వసభ్య సమావేశం (మహాజన సభ) కోరం లేక వాయిదా పడింది. సొసైటీ పరంగా అనేక అవకతవకలు జరిగిన నేపథ్యంలో సంబంధిత అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడంతో సభ్యులంతా ఆగ్రహం వ్యక్తపరుస్తూ సమావేశానికి హాజరుకాలేదని తెలుస్తోంది. ఈ సొసైటీలో సుమారు 2500 మంది సభ్యులుండగా ఈ సమావేశానికి కేవలం 20 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక సభను వాయిదా వేయాల్సి వచ్చింది.

అవినీతిని పట్టించుకోకనే సభ్యులు రాలేదు

సొసైటీలో జరిగిన అవకతవలకు ఈ సంఘటన అద్దం పడుతుందని హాజరైన 20 మంది సభ్యులలోని సొసైటీ మాజీ అధ్యక్షుడు ఉదయ్, సభ్యులు అడబాల గణపతిరావు, చిట్టిప్రోలు సత్తిబాబు, కోలా సత్యనారాయణ, కూరాకుల ధర్మరాజు, ప్రసన్నాంజనేయ విమర్శించారు. ముఖ్యంగా రైతులు సకాలంలో వడ్డీ చెల్లించినప్పటికీ ఓవర్ డ్యూ ఉందంటూ నోటీసులు రావడం, చెల్లించిన వడ్డీని జమ చేసిన రైతుల రుణాలను రెన్యువల్ చేయకపోవడం తదితర అనేక అవకతవకలు ఈ సొసైటీలో జరిగాయన్నారు. వీటిపై ఎంపీ పురందేశ్వరికి కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఇకనైనా ఈ సొసైటీపై పూర్తి స్థాయి విచారణ జరపాలని, రైతుల కోసం ఏర్పడిన సొసైటీని అవినీతి చీడ నుంచి కాపాడాలని కోరారు.

గైట్ ఫార్మసీలో స్వచ్ఛతాహి సేవ


స్వచ్ఛతను పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రాజానగరం: స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత అవసరాన్ని, ఆవశ్యకతను, ప్రభుత్వాలు స్వచ్ఛతకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రాంగణంలో చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛతాహి సేవను ప్రతిబింబించేలా ఎస్‌హెచ్‌ఎస్ అక్షరాల ఆకారంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఇంటా, బయటా పరిశుభ్రతను పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రన్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నందరాడలో పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి


కాపవరంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి/సీతానగరం: కోరుకొండ, సీతానగరం మండలాల్లోని పలు బాధిత కుటుంబాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పరామర్శించారు. కోరుకొండ మండలం కాపవరానికి చెందిన పందుల దుర్గారావు, మేలిమి భాస్కరరావు కుటుంబ సభ్యులను, శ్రీరంగపట్నంలో మల్ల నరసారావు, ఆళ్ల అచ్చియమ్మ, కనకాల కాంతం కుటుంబాలను, బొల్లెద్దుపాలెంలో అల్లబాని పైడిమ్మ, గోకేటి అచ్చిరాజు కుటుంబీకులను, సీతానగరం మండలం కూనవరానికి చెందిన ముసిమళ్ల మంగమ్మ, అయిల చిన్నారావు, మాధవరపు వెంకటరామారావు, ఆకుల వెంకట్రావు, ఆళ్ల భూరయ్యల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

రాజానగరం: మండలంలోని పాలచర్లలో రావి పాటి బాబు, విశ్వకోటి మార్తమ్మ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. అలాగే నందరాడలో బొమ్మకంటి వెంకట్రావు, తూర్పుగానుగూడెంలో గంటి నరసమ్మ, బొర్రా మరియమ్మ, దివాన్ చెరువులో సిద్దమతి చిట్టమ్మ, కొండమాచాల చంద్రరావుల కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి కలుసుకుని, పరామర్శించారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్‌పై సదస్సు


మాట్లాడుతున్న రిలయన్స్ ప్రాజెక్ట్ మేనేజర్ నాగేశ్వరరావు

కంబాలచెరువు: ఇంటర్‌లో 60 శాతం మార్కులు వచ్చిన విద్యార్థులకు రిలయన్స్ ఫౌండేషన్ తరఫున ఆన్‌లైన్ స్కాలర్ షిప్ పరీక్ష పెడుతున్నట్లు రిలయన్స్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.నాగేశ్వరరావు తెలిపారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యూఏసీ క్లియర్ గైడెన్స్, జేకేసీ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 50 వేలు చొప్పున అందజేస్తామని, దీనికి దేశవ్యాప్తంగా 5 వేల మందిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఫౌండేషన్ తరఫున ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారని, దానిలో ఇంగ్లిష్, ఇంగ్లిష్ న్యూమరికల్ వెర్బల్ ఉంటాయన్నారు. సభ అధ్యక్షుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఐపీఎస్సీ కో ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణ శ్రీ మాట్లాడుతూ కమ్యూనికేషన్, లైఫ్ స్కిల్స్‌పై పూర్తిస్థాయిలో పట్టుసాధించాలన్నారు. సదస్సులో మెడూరి లక్ష్మీనరసింహ, డాక్టర్ పీవీ సంజీవరావు, సోమశేఖర్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సాంఖ్యక శాస్త్ర విభాగ అధ్యాపకురాలు డి.మధులత పర్యవేక్షించారు.

2న లక్ష రుద్రాక్షల పూజ

సీటీఆర్ఐ: ఆర్యాపురంలోని కాల భైరవస్వామి క్షేత్రంలో బుధవారం వార్షిక లక్ష రుద్రాక్షల పూజ నిర్వహిస్తున్నట్టు లక్ష్మీకుబేర స్వర్ణాకర్షణ భైరవ క్షేత్రం నిర్వాహకుడు కాలభైరవ గురుస్వామి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ఉదయం 4.30 గంటలకు లక్ష రుద్రాక్షలతో ప్రత్యేక పూజ, సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం, 5:30 గంటలకు కాలభైరవ మహాచండీ హోమం జరుగుతుందన్నారు. పూజ, అభిషేకం, హోమం అనంతరం రుద్రాక్షలను భక్తులకు వితరణ చేస్తారన్నారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు భక్తులకు అన్నప్రసాదసేవ ప్రారంభమవుతుందని తెలిపారు. అలాగే 2వ తేదీన సంపూర్ణ సూర్య గ్రహణం అని విస్తృతంగా ప్రచారం జరుగుతోందని, వాస్తవానికి 2024, 2025 క్రోధి నామ సంవత్సరంలో ఎటువంటి గ్రహణాలు లేవని పంచాంగకర్తలు, పండితులు చెబుతున్నారన్నారు.

స్వచ్ఛత మన జీవితంలో భాగం కావాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

- మంత్రి కందుల దుర్గేష్
- ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం

సీటీఆర్ఐ: స్వచ్ఛత మన జీవితంలో భాగం కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో సోమవారం స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతితో కలిసి మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. 21 వేల మందితో ఏర్పాటు చేసిన మానవహారం ఆకట్టుకుంది. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజలందరూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ స్వచ్ఛతాహి కార్యక్రమంతో పాటుగా విజన్ 2047కి ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన గార్గ్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శానిటరీ సిబ్బంది, యువతతో కూడిన రికార్డు స్థాయిలో మానవ హారం కోసం పిలుపు నివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నరసింహ కిశోర్ పాల్గొన్నారు.



స్వచ్ఛతాహి సేవ ఆకారంలో విద్యార్థుల మానవహారం

మహిళా కారాగారంలో వసతుల పరిశీలన



మాట్లాడుతున్న డీఎస్ఎల్ఏ కార్యదర్శి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు సందర్శించారు. అక్కడి ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. కారాగారంలోని ఖైదీలతో మాట్లాడారు. వారి తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటీషన్లు, హైకోర్టుల్లో అప్పీలు వేయాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందన్నారు. ఇందుకోసం సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ అర్జీలను అందించాలన్నారు. ముద్దాయిలు, ఖైదీల గురించి పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గౌతమి జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడి వసతులు, సదుపాయాలను పరిశీలించిన తరువాత పిల్లలు, వయోవృద్ధులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు, వయోవృద్ధులకు పోషక ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆశ్రమంలో ఎలాంటి అసౌకర్యం ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కంబాలచెరువు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. చౌడేశ్వర్ నగర్‌కు చెందిన వి.వెంకటరాజు (37) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో గొడవలు రావడంతో తల్లి వద్దే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి యథాతథంగా నిద్రించిన వెంకటరాజు మర్నాడు ఉదయం ఎంతసేపటికీ తలుపు తీయలేదు. దీంతో తల్లి అచ్యుతమ్మ, చుట్టుపక్కల వారిని పిలిచింది. వారందరూ కలిసి తలుపు పగులకొట్టారు. లోపలికి వెళ్లి చూసేసరికి ఇంటిలో వెంకటరాజు ఉరివేసుకుని కనిపించాడు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.